ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 20 ఏప్రిల్ 2025

రూ.6 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా?

● వైసీపీ నాయకుల ఆక్రమణలో ప్రభుత్వ భూమి
● హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు


కడప-బెంగళూరు జాతీయ రహదారి పక్కనున్న సర్వే నెంబరు-87లోని ప్రభుత్వ భూమి

గుర్రంకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణంలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకోరల్లో చిక్కుకుంటున్నాయి. గత వైసీపీ హయాంలో కొన్ని ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకుని ఉపాధి హామీ పథకంలో పలు పనులు చేయించుకుని ఆ భూములను తమ స్వాధీనం చేసుకున్నారు. వైసీపీ నాయకులు ఆక్రమించుకున్న భూములు కడప-బెంగళూరు జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ఆ భూమి కోట్లల్లో పలుకుతోంది. గుర్రంకొండ పట్టణంలోని ప్రజలకు గుర్రంకొండ, చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ భూములున్నాయి. గుర్రంకొండ రెవెన్యూ గ్రామంలో చాలా వరకు పట్టా భూములున్నాయి. కాగా చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలో 1800 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూముల్లో కొందరికి రైత్వారీ పట్టాలున్నాయి. చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలో కొంతమేర భూములు అనాధీనంలో ఉన్నాయి. ఈ అనాధీనంలోని భూములను కొందరు వైసీపీ నాయకులు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించుకున్నారు. ఇలా ఆక్రమించుకున్న భూమిని లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబరు 87/7లో 2.68 ఎకరాలు, 87/8లో 2 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో అనాదీనంగా ఉంది. ఈ భూమిని కొందరు నాయకులు ఆక్రమించుకున్నారు. ఈ ప్రాంతంలో ఎకరా 2 కోట్ల వరకు పలుకుతోంది. కబ్జాదారులు ఆక్రమించుకున్న భూమి విలువ రూ.6 కోట్లు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఈనెల 3వ తేదీ భూమిని సర్వే చేయించారు. అనంతరం ప్రభుత్వ భూమి చుట్టూ ట్రెంచ్ తీయడానికి ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తుండగా విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు అధికార పార్టీ నేతల నుంచి రెవెన్యూ అధికారులకు ఫోన్ చేయించడంతో రెవెన్యూ అధికారులు చేసేదిలేక వెనక్కి తగ్గారు.

ప్రభుత్వ భూమిని అమ్మేశాడు..

చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలో వైసీపీ నాయకులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమి విలువ కోట్లలో ఉంది. ఈ భూమిని ఆక్రమించుకొన్న ఓ వైసీపీ నాయకుడు అందులో బోరు వేసి పంట సాగు చేసుకుంటున్నాడు. అందులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కొంత భూమిని కుంట స్థలం రూపాయలు 60 వేలు చొప్పున ఇద్దరు వ్యక్తులకు పది కుంటల స్థలాన్ని రూ.6 లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. దీంతో సర్వే నెంబరు-87లోని భూమి ప్రభుత్వ భూమి అని అధికారుల సర్వేలో తెలియడంతో భూమిని కొన్న వ్యక్తులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ డబ్బు ఇచ్చేయాలంటూ అమ్మిన వ్యక్తిని గట్టిగా అడుగుతున్నట్లు సమాచారం.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు

కడప-బెంగుళూరు జాతీయ రహదారి పక్కనున్న విలువైన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 87/8లో 2 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ విలువైన భూమిని కొందరు చదును చేసి ఆక్రమించుకోవడానికి కొన్ని రోజులుగా మట్టి పనులు చేస్తున్నారు. ఈ భూమి ప్రభుత్వ భూమి కావడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులను గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని నిబంధనలను ఉల్లఘిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డును రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు భరత్‌నాయక్, పక్షావలి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అది ప్రభుత్వ భూమి..

చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబరు-87లో 4.68 ఎకరాలు ప్రభుత్వ భూమి. దీనిని కొందరు ఆక్రమించుకున్నట్లు తెలియడంతో సర్వే చేయించి ఆక్రమాలను గుర్తించాం. ప్రభుత్వ భూమి చుట్టూ ట్రెంచ్ కొట్టించి బోర్డును ఏర్పాటు చేశాము. అలాగే చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలో జాతీయ రహదారి పక్కన అన్యాక్రాంతమైన భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటాం.

- శ్రీనివాసులు, తహసీల్దార్, గుర్రంకొండ

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో..
నారాయణ విద్యార్థుల హవా


విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్ చంద్రకిశోర్ రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): శనివారం విడుదలైన జేఈఈ-మెయిన్స్-2025 ఫలితాలలో కడప నారాయణ కళాశాల విద్యార్థుల హవా కొనసాగిందని ఆ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆలిండియా ర్యాంకుల్లో అబ్దుల్ హసీమ్ 1417వ ర్యాంకు, రామ్‌శరణ్ 2082, జగత్ స్మరణ్‌రెడ్డి 2336, ఆదిత్యవర్ధన్‌రెడ్డి 2550, ధనుష్ 3523, సుధీర్‌కుమార్‌రెడ్డి 6095, ధీరజ్‌కుమార్‌రెడ్డి 8179, శ్రీలేఖ-11049, సుజన 14426, నితిన్‌రెడ్డి 17071, ఉమర్ 18435, మహమ్మద్‌హసాన్ 20032, దీపక్ 24658, మహమ్మద్ అజాన్ 25763 ర్యాంకులు సాధించారన్నారు. 200 మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించారన్నారు. విద్యార్థులను డీజీఎం రామమోహన్‌రెడ్డి, కోర్‌డీన్ చంద్రకిశోర్‌రెడ్డి, డీన్స్ సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపా ల్స్ మురళీమోమన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య రాఘవరెడ్డి, సుమన్ అభినందించారు.

శ్రీచైతన్య కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కడప ఎడ్యుకేషన్, ఏపిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో కడప శ్రీచైతన్య కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఆలిండియా అన్ని కేటగిరీలలో టి.గౌతమ్ 321, ఇ.జస్వంతి 458, ఎం.గురుసూర్య 818, బి.అన్విత్ 1214, కె.సతీశ్ 1968, కె.శివరామ్ నాయక్ 6094 ర్యాంకులతో పాటు 52 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్ష రాయడానికి అర్హత సాధించారని కళాశాల యాజమాన్యం తెలిపింది. పోటీ పరీక్షలలో టాప్ ర్యాంకుల సాధనే ధ్యేయంగా కృషి చేస్తూ ఆలిండియా పరీక్షల సాధనలో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో శ్రీచైతన్య విద్యా సంస్థ విశిష్ట ప్రణాళిక, ఉత్తమ మెటీరియల్స్, అధ్యాపకుల నిరంతరకృషి, ప్రోత్సాహమే కారణమని శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్లు సుష్మశ్రీ, నాగేంద్ర కుమార్ తెలిపారు. శ్రీచైతన్య తిరుపతి డివిజన్ ఏజీఎం బీవీ ప్రసాద్, డీఎస్ కేఎల్‌జీ ప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రవీణ్, నాగరాజు, అడ్మిన్ ఆఫీసర్ మనోజ్, మల్లికార్జునస్వామి, నాగిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ అభినందించారు.

రైతులను ఆదుకుంటాం

● రూ.6 కోట్లకు పైబడి నష్టం
● పండ్ల తోటల పరిశీలనలో
చమర్తి జగన్‌మోహన్‌రాజు


దెబ్బతిన్న పండ్ల తోటలను పరిశీలిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలుల వల్ల దెబ్బతిన్న పండ్ల తోటల రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు తెలిపారు. శనివారం ఆయన తహసీల్దార్ పీర్‌మున్నీతో కలిసి దెబ్బతిన్న పండ్ల తోటలను పరిశీలించారు. అరటి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ రాజంపేట మండలంలోని మిట్టమీదపల్లె, కొల్లావారిపల్లె, మేకావారిపల్లె చుట్టుపక్కల గ్రామాల్లో ఈదురుగాలుల వల్ల 235 ఎకరాల్లో అరటి దెబ్బతిందని, సుమారు 6 కోట్లకు పైబడి నష్టం జరిగిందని, ఈ మేరకు నివేదికలను అధికారులు ప్రభుత్వానికి పంపుతారన్నారు. త్వరలోనే నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.





మరమ్మతులకు మోక్షమెప్పుడో...?

- మూడేళ్ల క్రితం తెగిన హంద్రీ-నీవా కాలువ
- రాకపోకలకు ఇబ్బందులు
- ఆయకట్టంతా బీడుగానే...
- ఈ ప్రభుత్వంపైనే ఆశలు


గండి పడిన హంద్రీ-నీవా కాలువ


బీడుగా మారిన ఆయకట్టు భూములు

పెద్దమండ్యం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలంలో గండ్లు పడిన చెరువులు, కాలువల అభివృద్ధి పనుల మరమ్మతులకు మోక్షమెప్పుడోనని రైతులు ఎదురుచూస్తున్నారు. భూగర్భ జలాలు పెంచే చెరువులు, హంద్రీ-నీవా కాలువలకు వర్షాకాలంలో గండ్లు పడ్డాయి. తూతూమంత్రంగా తాత్కాలిక మరమ్మతు పనులతో సరిపెట్టారే కానీ శాశ్వత పనులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ప్రజలు విమర్శస్తున్నారు. మూడేళ్లుగా మరమ్మతు వ్యవహారం గాలికి వదిలేశారు. అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు రావడం లేదు. తద్వారా ఆ ప్రాంతాల రైతులు నష్టపోతున్నారు.

మూడేళ్ల క్రితం నివర్ తుఫాన్ ధాటికి పెద్దమండ్యం పరిధి దొమ్మరపల్లి సమీపంలో హంద్రీ-నీవా కాలువకు గండి పడింది. దీంతో కాలువపై నిర్మించిన బ్రిడ్జి పక్కన ఉన్న గ్రామాలకు వెళ్లే దారి కూడా ధ్వంసమైంది. ఆయా గ్రామ ప్రజలు ఏడాదిగా దారి సమస్యతో ఇబ్బందులు పడ్డారు. దొమ్మరపల్లెలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు ప్రతిరోజూ అవస్థలు పడేవారు. దీంతో అధికారులు చర్యలు తీసుకుని గండి పడిన కాలువను తాత్కాలిక మట్టి పనులతో చేసి దారి ఏర్పాటు చేశారు. అది ఇప్పుడు మళ్లీ ధ్వంసం కావడంతో.. వర్షాకాలం ప్రారంభమైతే ఈ మార్గంలో మళ్లీ ప్రజలకు కష్టాలు తప్పవని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

గతంలో కురిసిన వర్షాలకు పలు చెరువులు, కాలువలకు గండ్లు పడ్డాయి. మండలంలోని పెద్దమండ్యం పరిధిలోని గెల్లంవారిపల్లెకు సమీపంలోని కుషావతి నదిపై నల్లరాతిమడుగు ప్రాజెక్టు పనులు జరిగాయి. అక్కడ కుషావతినది నుంచి చెరువుకింద పల్లి లంజుకుంటచెరువు, పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాలకుంట కాలువలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం తుఫాన్ సమయంలో నది ఉధృతి పెద్దమండ్యం పాతచెరువు కాలువపై సాగడంతో మాసాబీబీ దర్గా సమీపంలో కాలువకు గండి పడింది. అప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక మట్టి పనులు చేయించారు. కానీ కాలువ లీకేజీలు ఆపలేకపోయారు. ఈ వర్షాకాలంలో కురిసిన వానలతో ఆ మూడు చెరువులకు వర్షపు నీటితో జలకళ సెలకొంది. రైతులు హర్షించినా ఆయకట్టు భూముల్లో పంటలు సాగుచేసేందుకు సిద్ధపడలేదు. తాత్కాలిక పనులు చేసిన కాలువలకు మళ్లీ గండ్లు పడతాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఆ మూడు చెరువుల కింద ఆయకట్టు భూములు బీడుగా మారాయి. కేవలం 100 మీటర్ల కాలువకు శాశ్వత అభివృద్ధి పనులు చేయడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వచ్చాయి. గతంలో రబీలో వరి పంట చివరి దశలో పంటలకు నీరందకపోవడంతో ఎండిపోయాయి. దీంతో పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాలకుంట కింద ఆయకట్టు సుమారు 90 ఎకరాల్లో బీడుగా మారింది. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఈ వేసవిలో ఈ కాలువలో గండి పూడ్చి శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దొమ్మరపల్లి సమీపంలోని హంద్రీ-నీవా కాలువకు గండి పడిన ప్రాంతంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


గండి పడిన సమయంలో విద్యార్థుల కష్టాలు (ఫైల్)

నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తాం

గండి పడిన చెరువులు, కాలువ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాము. మండలంలో గండ్లు పడిన అభివృద్ధి పనుల కోసం రూ.6.5 కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. నిధులు మంజూరు చేసిన వెంటనే అభివృద్ధి పనులు చేపడతాం.

- శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జ్ ఏఈఈ ఇరిగేషన్ శాఖ, తంబళ్లపల్లి

విజృంభిస్తున్న జ్వరాలు

- ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న బాధితులు


జ్వరంతో ఇంటి వద్దే చికిత్స పొందుతున్న మహిళ, నాగేంద్ర

సిద్దవటం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జంగాలపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో 15 రోజులుగా జ్వరాలు విజృంభించాయి. బాధితులు వైద్యం కోసం కడప, తిరుపతి, నెల్లూరు పట్టణాల ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు పెట్టుకుని వైద్యం చేసుకుంటున్నారు. గ్రామంలో మరికొంతమందికి విషజ్వరాలు విజృంభించి ఒళ్లు నొప్పులు, దగ్గు, తలనొప్పి బారిన పడి మంచానికి పరిమితమయ్యారు. అంగన్వాడీ కేంద్రం మంచినీటి ట్యాంకు వద్ద సైడ్ కాలువల్లో మురికినీరు నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. దోమలు కుట్టడం వల్ల జ్వరాలబారిన పడ్డారు. ఇప్పటికైనా వైద్యసిబ్బంది గ్రామంలో పర్యటించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించాలని పలువురు తెలియజేశారు. విష జ్వరాల విషయంపై కడప డీఎంహెచ్‌వో నాగరాజును వివరణ కోరగా జంగాలపల్లె ఎస్సీ కాలనీలో వైద్యసిబ్బందితో పర్యటించి ఇంటింటి సర్వే చేసి ప్రతి రోగి రక్తనమూనాలు సేకరించి మందులు పంపిణీ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి


రైల్వేకోడూరులో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం నిర్వహించి రోడ్లలో చెత్తచెదారాలను ఊడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పొడిచెత్త, తడిచెత్తను వేర్వేరుగా పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు వేయాలని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా ఉండాలన్నారు. చెత్తతో సంపదను సృష్టించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, వెలుగు ఏపీఎం వసుంధర, వ్యవసాయశాఖ అధికారి జి.సుధాకర్, రైల్వేకోడూరు సర్పంచ్ బుడిగి శివయ్య, ఉపాధి ఏపీవో మృత్యుంజయరావు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరప్రసాద్‌రావు, కూటమి నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, పఠాన్ మౌలా, రాజ, మైనార్టీ నాయకులు జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


మృతి చెందిన ఆరీఫ్, గాయపడ్డ ముజాహిద్

లక్కిరెడ్డిపల్లె/చిన్నమండెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటపల్లికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ ఆరీఫ్ (35) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆరీఫ్ బంధువుల వివరాల మేరకు... ఆరీఫ్ తన మిత్రుడు చిన్నమండెంకు చెందిన ముజాహిద్‌తో కలిసి పనిమీద వ్యానులో మదనపల్లెకు బయలుదేరారు. తిరిగి వస్తూ మదనపల్లె-తిరుపతి రోడ్డు మార్గంలోని చిన్నతిప్పసముద్రం సమీపంలో ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను తప్పించబోయి వ్యాను చెట్టును ఢీకొంది. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆరీఫ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ముజాహిద్ పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. కాగా ఆరీఫ్‌కు భార్య ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

పుల్లంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట పెట్రోల్ బంకు వద్ద శనివారం స్కూటరుపై వెళుతున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఓబులవారిపల్లె మండలం చిన్నంపల్లెకు చెందిన దాసాను గంగరాజు స్కూటర్‌పై పుల్లంపేటకు వెళుతుండగా పెట్రోల్ బంకు వద్దకు రాగానే వెనుకవైపు వస్తున్న లారీ స్కూటర్‌ను ఢీకొనడంతో గాయపడ్డాడు. పుల్లంపేట ఏఎస్ఐ పిచ్చయ్య సంఘటనాస్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని 108లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడ్డ జయప్రకాశ్ నారాయణ

సిద్దవటం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలంలోని కనుమలోపల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లెకు చెందిన జయప్రకాశ్ నారాయణ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఏపీ04ఏఏ 7640 నంబరు గల ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఆవు అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫి సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. జయప్రకాశ్‌నారాయణ కడప హెచ్‌పీసీఎల్‌లో పనిచేస్తున్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి


శివకుమార్ (ఫైల్)

సుండుపల్లె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో హోంగార్డు జి.శివకుమార్ (36) మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. సుండుపల్లె మండలం కోడూరువాండ్లపల్లికి చెందిన శివకుమార్ రాజంపేట సబ్ డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున సుండుపల్లెలోని తన ఇంట్లో మృతి చెందినట్లు తెలిపారు. శివకుమార్‌కు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. హోంగార్డు కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హామీ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన కుటుంబానికి రూ.20 వేలు అందజేశారు.

సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైకోట అడవి ప్రాంతంలో జిల్లా సహాయ అబ్కారీ అధికారి జోగేంద్ర, కోడూరు ఎక్సైజ్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, అటవీ శాఖ అధికారులు, పోలీసులు శనివారం సంయుక్తంగా దాడులు నిర్వహించి సారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. 100 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేశారు. వైకోటకు చెందిన గంగయ్యను అదుపులోకి తీసుకొని 8 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపుపై అవగాహన ఉండాలి

- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్


వ్యర్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వ్యర్థాల శాస్త్రీయ తొలగింపుపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం అనే కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ శ్రీధర్ పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నేడు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం అనే థీమ్‌తో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, పెద్ద పంచాయతీల్లో ప్రతిరోజూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ జరుగుతుందని, మిగిలిన పంచాయతీల్లో వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై ఎస్‌హెచ్ గ్రూపులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని, వారి ద్వారా ప్రజల దగ్గర నుంచి ఈ-వ్యర్థాలను సేకరిస్తున్నామన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో శనివారం 170 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించబడ్డాయని తెలిపారు. వాటిని ప్రైవేటు కంపెనీలకు అందిస్తే వారు రీసైక్లింగ్ చేస్తారన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు తాజా సర్టిఫికెట్లు పొందాలి

- డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలపై బదిలీ కోరే ఉపాధ్యాయులు వారి అనారోగ్యానికి సంబంధించిన తాజా సర్టిఫికెట్లను పొందాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వుల మేరకు ఈ ఏడాదిలో జరగబోయే ఉపాధ్యాయ బదిలీల్లో ప్రతిపాదిత మార్గదర్శకాలను అనుసరించాలన్నారు.

కడప రిమ్స్‌లో ఏర్పాటు చేసిన అదనపు డైరెక్టర్లు, వైద్య విద్యా సూపరింటెండెంట్‌లు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు (మూడు రోజుల వ్యవధిలో) ఆరోగ్య ధ్రువపత్రాలు జారీ చేస్తారని తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ధ్రువపత్రాలు పొందాలని తెలిపారు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. దీనిపై వివరణాత్మక మార్గదర్శకాలు త్వరలో జారీ చేస్తారన్నారు. ఆరోగ్య కారణాలపై బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు సంబంధిత జిల్లా వైద్య మండలి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయులు తిరుపతిలోని ఎస్వీఆర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి, ఉమ్మడి కడప జిల్లా ఉపాధ్యాయులు కడప రిమ్స్ ప్రభుత్వాసుపత్రి నుంచి తాజా వైద్య ధ్రువపత్రాలను పొందాలని తెలిపారు.

అగ్నిప్రమాదాలను ఎదుర్కొనే పద్ధతులపై అవగాహన


మంటలను ఆర్పే విధానాన్ని చూపుతున్న దృశ్యం

పీలేరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పద్ధతులు, ఉపయోగపడే సాధనాలు, పాటించాల్సిన చిట్కాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనిల్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పీలేరు అగ్నిమాపక సిబ్బంది శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు, వాటి నివారణ, ఎదుర్కొనే విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ అంతస్థుల భవనాలలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా నివారించాలి, మంటల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. గ్యాస్, ఆయిల్, విద్యుత్ తీగల మంటలను ఆర్పే విధానాలను ప్రయోగాత్మకంగా డెమో రూపంలో ప్రదర్శించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే 101, 08584-244399, 9963736587 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి మస్తాన్, సిబ్బంది నాగిరెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశ్, రెడ్డిశేఖర్, మహబూబ్ బాషా, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

19పీఎల్ఆర్ వీఎల్‌కే2: వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రమాదాల సమయాన భయపడొద్దు..

వాల్మీకిపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు సంభవించినపుడు అప్రమత్తంగా ఉండటం ద్వారా బయట పడవచ్చునని వాల్మీకిపురం అగ్నిమాపక కేంద్ర అధికారి బాబయ్య తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, డాక్టర్లు సోని, శివాణి, ఆసిఫ్, జ్ఞానేశ్వర్, ఫైర్ మెన్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ అధ్యాపకుల పోస్టుల రద్దు.. వద్దు!

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులు రద్దు చేయ రాదంటూ మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వ్యాయామ అధ్యాపకులు శనివారం ఆ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీలు మురళీ, నరేష్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లోని జూనియర్ లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను రద్దు చేయడం బాధాకరం అన్నారు. ఈ విషయంపై ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు, విద్యా శాఖమంత్రి నారాలోకేశ్‌కు విన్నవించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలోదేవకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌కు కలాం కార్మిక రత్న అవార్డు


అవార్డును అందుకుంటున్న కండక్టర్ సీఎస్ మణ్యం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కండక్టర్ సీఎస్ మణ్యంకు ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ తరపున కలాం కార్మిక రత్న అవార్డును శుక్రవారం అందజేశారు. రాజంపేట ఆర్టీసీ డిపోలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న మణ్యంకు తమిళనాడు రాష్ట్రం మదురైలోని జేపీ ఇండోర్‌స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ జాతీయ సదస్సులో అవార్డును అందజేశారు. ఆయన సేవలకు గాను ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు.

మహిళపై దాడి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పొలంలో రాళ్లు వేయడాన్ని అడ్డుకున్నందుకు ఓ మహిళపై దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం, మాలేపాడు పంచాయతీ కతోళ్లపల్లెకు చెందిన గుర్రప్ప భార్య గోపెమ్మ(40) శనివారం తన పొలంలో ఉండగా అదే గ్రామానికి చెందిన కదిరప్ప, సరసమ్మ, భాస్కర కర్రలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. కుటుంబసభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రాజెక్టుల రూపకల్పనలో నైపుణ్యం సాధించాలి

కలకడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సైన్స్ ప్రాజెక్టుల రూపకల్పనలో నైపుణ్యం సాధించాలని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. కలకడ ఆదర్శ పాఠశాల్లో శనివారం ప్రారంభమైన అటల్ బూత్ క్యాంప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిద్ధాంతం, అభ్యాసం మధ్య అంతరం తగ్గడానికి ఇలాంటి శిక్షణ దోహదపడుతుందన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత, అన్వేషణాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మలాంషా వలి మాట్లాడారు. ఎంఈవో మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తప్పులను కప్పిపుచ్చుకోవడానికే రైతులపై కేసులు

- జనసేన కో ఆర్డినేటర్ రాందాస్‌చౌదరి


ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలుపుతున్న జనసేన నాయకుడు రాందాస్‌చౌదరి, సీపీఎం శ్రీనివాసులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చిరుత మృతి ఘటనలో అటవీశాఖ అధికారులు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే రైతులపై కేసులు నమదు చేశారని జనసేన రాయలసీమ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి మండిపడ్డారు. శనివారం స్థానిక అటవీశాఖ రేంజర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులను ఆయన పరామర్శించారు. ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావుతో మాట్లాడుతూ ఉచ్చులు వేసిన వేటగాళ్లను అరెస్టు చేయకపోగా, 8 గంటల పాటు బందీగా వున్న చిరుతను కాపాడటంలో అటవీశాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. దీని తప్పుదోవ పట్టించేందుకు ఏడుగురు రైతులపై కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. ఈ విషయమై జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతా మన్నారు. రైతు కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పొన్నేటిపాళెం ప్రాంతంలో చిరుత సంచారంపై పది నెల లుగా గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారని, కాని అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. తప్పు చేసిన అధికారులనే విచారణ అధికారులుగా నియమించడంతో దోషులు అవలీలగా తప్పించుకుం టార న్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి జంగాల శివరామ్, రైతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. పసుపు బాగు

- ఎకరాకు 20.4 టన్నుల దిగుబడి
- కొనుగోలు చేసేందుకు తరలివస్తున్న దూరప్రాంతాల రైతులు



అధిక దిగుబడి వచ్చిన మైదుకూరు రకం పసుపు

చెన్నూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రసాయన రహిత వ్యవసాయమైన ప్రకృతిసేద్యంతో ఆ రైతు పసుపు సాగు చేశారు. తద్వారా ఎకరాకు 20.4 టన్నుల దిగుబడి వచ్చింది. దీంతో సాగు చేసిన రైతు సంతోషిస్తూ మరికొందరు రైతులకు మార్గదర్శకంగా మారారు. రసాయనిక రహిత పసుపు కావడంతో ధర కూడా మామూలు సాగు పసుపు కన్నా మూడు రెట్లు ఎక్కువగా ఉంది. రైతుకు ఆదాయంగా మారి ధర కూడా పెరగడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని కనుపర్తికి చెందిన రైతు దండుబోయిన బాలక్రిష్ణ పది నెలల కిందట బలసింగాయపల్లెలో రెండు ఎకరాల్లో పసుపు సాగు చేశారు. మైదుకూరు నుంచి తెచ్చిన పసుపు రకంతో పాటు అస్సాం నుంచి తెచ్చిన లాకడ్గాన్ రకం సాగు చేశారు. కొంతకాలంగా ఆంధ్ర, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల్లో ప్రకృతి సేద్యంతో సాగవుతున్న పసుపు పంటతో పాటు పలురకాల పంటలు పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడి సాగు ఎలా చేపట్టాలో తెలుసుకుని అదే స్ఫూర్తితో బలసింగాయపల్లెలో పసుపు సాగు చేశారు. ఈ పంట బాగా పెరిగేందుకు మంచి దిగుబడి రావడానికి అక్కడి రైతులు చెప్పిన సలహాలతో పాటు పలు ప్రాచీన పద్ధతులు అవలంభించారు. రసాయనాలను పూర్తిగా పక్కన పెట్టేశారు.



పొలంలో పసుపు కొమ్ములు ఏరుతున్న కూలీలు

సాగు చేసిందిలా...

ప్రకృతి సేద్యంతో చేపట్టిన పసుపుసాగులో రాజస్థాన్ నుంచి పంట కోసం రాక్ ఫాస్పేట్ కొనడంతో పాటు కేరళ నుంచి స్పైసెస్ బోర్డు ద్వారా బ్యాక్టీరియా కల్చర్ కొనుగోలు చేశారు. అలాగే రాజస్థాన్‌లోని పత్తిమేడ గోశాల నుంచి 11 కిలోల దేశవాళీ నెయ్యిని తెప్పించి కానుగపిండి, వేపపిండి, ఆవాల పిండిని పంటలో వాడారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆవుపిడకలతో అక్షింతలు, సుగంధ ద్రవ్యాలు కలిపి అగ్నిహోత్రం చేశారు. వీటి వల్ల కొమ్ములు బాగా నాణ్యంగా బరువు పెరిగేందుకు ఉపయోగపడింది. అంతేకాక పదిరోజులు, 20 రోజులకు ఒక మారు ఘనజీవామృతాన్ని పిచికారి చేశారు. దీంతో పది నెలల్లో పంటను తవ్వడంతో 20.4 టన్నుల దిగుబడి వచ్చింది.

కొనేందుకు తరలివస్తున్న రైతులు

నాణ్యమైన పసుపు రసాయన రహితం కావడంతో ఈ పసుపుకు డిమాండ్ పెరిగింది. పసుపు కొమ్ములు చూసేందుకు కూడా ఎంతో బరువుగా నాణ్యతగా ఉన్నాయి. దీంతో సాధారణ రసాయనాలతో సాగు చేసిన పసుపు కిలో రూ.25 పలికితే రసాయన రహితమైన ఈ పసుపు పచ్చిదే కిలో రూ.90 వరకు ఉంది. అలాగే ఈ పసుపు ఎండబెట్టి పొడి చేస్తే కిలో రూ.400గా ఉంటుంది. లాకడాన్ పసుపు రకం పచ్చికొమ్ములే కిలో రూ.400 నుంచి 450, కొమ్ములు ఉడకబెట్టి ఆరబెట్టి పసుపు చేసి అమ్మితే కిలో రూ.4వేల వరకు ధర పలుకుతుంది.

పూర్ణరూపంలో పసుపు



ప్రస్తుతం సాగు చేసిన పసుపులో అన్ని రకాల పూర్వదేశీయ పద్ధతులు వాడుతూ రసాయనాల మాటే లేకపోవడంతో ఎంతో నాణ్యతగా మంచి దిగుబడినిచ్చింది. ఈ కొమ్ములను పలువురు శాస్త్రవేత్తలు పరిశీలించారు. దీంతో పంచతత్వాలు పూర్ణరూపంగా ఉన్నాయని చెప్పారు. పైగా అస్సాం పసుపు పొడి అయితే కిలో రూ.400, లాకడాన్ పసుపు పొడి కిలో రూ.2వేలు ధర పలుకుతుంది. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి రైతులు తరలివస్తున్నారు. కేవలం కడప జిల్లా కాకుండా అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి రైతులు ఆన్‌లైన్ ద్వారా కొనుగోలుకు సిద్ధపడుతున్నారు. అలాగే బెంగుళూరు, హైదరాబాద్ నుంచి కొందరు రైతులు పసుపు కావాలంటూ అడుగుతున్నారు.

– డి.బాలక్రిష్ణ రైతు, కనుపర్తి

అబ్బురపరిచే విషయం

రసాయన రహితంగా సాగు చేసిన పసుపుపై రుద్రాక్షమాల ఉంచితే సవ్యదిశలోనూ, రసాయనాలతో కూడిన పసుపుపై రుద్రాక్షమాల ఉంచితే అపసవ్య దిశలోనూ తిరుగుతుందని రైతు బాలచంద్ర చెబుతున్నారు. ఈ పసుపు చేతిలో పట్టుకున్నా, కొద్దిగా నోటి రుచి చూసినా దీని శక్తి ఏంటో, రైతులు పరిశీలించవచ్చని ఆయన వివరిస్తున్నారు.

ఖాదర్‌పల్లెలో పోలీసుల నాకాబందీ



పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

చాపాడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో శనివారం తెల్లవారుజామున పోలీసులు నాకాబందీ నిర్వహించారు. మైదుకూరు డివిజన్ డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ట్రైనింగ్ డీఎస్పీ భవానీ, మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, అర్బన్ సీఐ శ్రీహరి, బద్వేలు సీఐ రాజగోపాల్, ఎస్‌ఐలు చిన్నపెద్దయ్య, సత్యనారాయణ, హనుమంతు, చిరంజీవి, సుబ్బారావు, వినోద్‌కుమార్, రాజు, 150 మంది సివిల్ పోలీసులు, కడప స్పెషల్ పార్టీకి చెందిన 70 మంది పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఇంటింటిని తనిఖీ చేశారు. గ్రామస్థులతో మాట్లాడి ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. ఈ తనిఖీల్లో రికార్డులు లేని నాలుగు ద్విచక్ర వాహనాలు దొరికినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య పేర్కొన్నారు. ఇటీవల ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన ముగ్గురు దొంగలను పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. బంగారు, డబ్బు దొంగతనం కేసులకు సంబంధించి వారిని పోలీసులు విచారిస్తున్నారు.

విద్యార్థిని చితకబాదిన కరస్పాండెంట్

- తల్లిదండ్రుల ఆగ్రహం



గాయాలపాలైన విద్యార్థి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థి ఆ పాఠశాలలోని ఫర్నీచరు, ఫ్యాన్‌ను ధ్వంసం చేసి నష్టపరిచాడనే నెపంతో కరస్పాండెంట్ చితకబాదిన ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా.. పోరుమామిళ్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శనివారం ఆ పాఠశాలలోని ఫర్నీచర్, ఫ్యాన్‌ను ధ్వంసం చేశాడు. దీంతో కరస్పాండెంట్ ఆ విద్యార్థిని పిలిపించి వీపు విమానం మోత మోగించి గాయపర్చినట్లు తెలిసింది. ఆ విద్యార్థి ఎంత ప్రాధేయపడినా వినకుండా కర్రలతో కొట్టినట్లు చెబుతున్నారు. పైగా ఓ తెల్లకాగితంపై ఆ విద్యార్థి ఫ్యాను విరగ్గొట్టినట్లు రాయించుకున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు ఆ పాఠశాల కరస్పాండెంట్‌పై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా, తమపై ఫిర్యాదు చేస్తే.. తమ పాఠశాల ఫర్నీచరు ధ్వంసం చేసినందుకు తాము కూడా విద్యార్థిపై ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. ఈ విషయం ఎక్కడైనా చెబితే టీసీ ఇచ్చి పంపుతామని బెదిరించినట్లు సమాచారం. దీంతో వారు చేసేదేమీ లేక వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ఘటన పోరుమామిళ్లలో దావానంలా వ్యాపించింది.

48 హెక్టార్లలో అరటి నేలమట్టం

- రూ.1.80 కోట్ల నష్టం

లింగాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పెనుగాలులు వడగండ్ల వర్షానికి మండలంలోని వెలిదండ్ల, కర్ణపాపాయపల్లె గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు 48 హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లిందని పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. నష్టపోయిన రైతు వివరాలను సేకరించి నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రైతులకు సుమారు రూ.1.80 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు.



అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి శ్రీలేఖ

సింహాద్రిపురం: రెండు రోజులుగా (శుక్ర, శనివారం)లో వీచిన ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో అరటి పంట నేలమట్టమైంది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు పంట సాగుకు ఎకరానికి సుమారు రూ.2 లక్షలు వెచ్చించి పంటను పండించారు. తీరా డబ్బులు చేతికి వచ్చే సమయంలో ఇలాంటి విపత్కర పరి స్థితులు ఏర్పడటంతో రైతులు కోలుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడు తున్నారు. ఉద్యానవన శాఖాధికారుల అంచనాల మేరకు 60 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు మండల ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. అంకాళమ్మ గూడూరులో దెబ్బతిన్న అరటి తోటలను వీహెచ్‌ఏ శ్రీలేఖ పరిశీలించారు.

కాలుష్య రహితంగా కోర్టు పరిసరాలు

- ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన జడ్జి వెంకటేశ్వర్లు



పరిసరాలను శుభ్రపరుస్తున్న ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన జడ్జి వెంకటేశ్వర్లు

కడప రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టి ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా కోర్టు పరిసరాలను కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతున్నామని ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన జడ్జి, మొదటి అనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిశుభ్రత ఉన్నచోటనే పరిశుభ్రమైన ఆరోగ్యం ఉంటుందని, వ్యర్థ పదార్థాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు బాబాఫకృద్దీన్, కె.ప్రత్యూషకుమారి, ఆసిఫా సుల్తానా, జె.హేమస్రవంతి, కె.భార్గవి, జి.విజయలక్ష్మి, న్యాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ కేడర్ కల్పించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానిపాషా

కడపకలెక్టరేట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ కేడర్ కల్పించి, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎండీ జానీపాషా డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఏపీ ఎన్జీవో సంఘ కార్యాలయంలో ఏపీ జేఏసీ సారథ్యంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే హీ రామియా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ విద్యార్హతతో ఉద్యోగాలు సాధించిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటివరకు రికార్డు అసిస్టెంట్ కేడర్, అంతకంటే తక్కువ కేడర్‌తో పేస్కేల్ అమలవుతోందన్నారు. దీన్ని జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు మార్పు చేసి ఈ పేస్కేల్ అమలు చేయడం ద్వారా సచివాలయ ఉద్యోగులకు సరైన గౌరవం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘ నేతలు కిరణ్‌కుమార్, నగర అధ్యక్షుడు చిన్నయ్య, కార్యదర్శి శైలేష్‌రెడ్డి, కోశాధికారి నాగార్జున, చిన్నమస్తాన్ సురేష్ బాబు, సుధాకర్, వీరయ్య పాల్గొన్నారు.

గోశాల అభివృద్ధికి సహకరిస్తా



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, పక్కన ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్

దువ్వూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గోశాల అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె తెలుగుగంగ వద్ద ఉన్న ముక్తిదామ గోశాలను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ 300 గోవులను సంరక్షించడమంటే మాటలు కాదని నిర్వాహకులను ఆయన ప్రశంసించారు. తాను చిన్నప్పుడు చదువుకుంటూ గోవుల పెంపకానికి వెళ్లేవాడినని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. తమ తల్లి ఇప్పటికి 35 గోవుల ఆలనా పాలన చూస్తున్నారని చెప్పారు. గోశాల అభివృద్ధికి కలెక్టర్‌గా తనవంతు సహకరించాలని వరదరాజులరెడ్డి కోరారని, ఇక్కడికి వచ్చి చూసిన తర్వాత వారి కష్టం అర్థమవుతోందని తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ గోశాల నిర్వాహకుల కృషి ప్రశంసనీయమన్నారు. 25 ఎకరాల్లో గడ్డి పెంపకం జరుగుతోందని ఇంకా సౌకర్యాలు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే గోశాల అభివృద్ధికి రూ.50 లక్షలు ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే చెప్పారు. కలెక్టర్‌ను ఇక్కడకు రప్పించి వీటి సంరక్షణకు అవసరమైన విషయాలను తెలపాలనే కృషి ఫలించిందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఇక్కడ గోవుల సంరక్షణకు తనవంతు కృషి చేసి టీటీడీ నిధులు మంజూరు చేశానని చెప్పారు. గోశాల అభివృద్ధికి పాటుపడుతానని పేర్కొన్నారు. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీతో పాటు పలువురు అధికారులు, నాయకులు, సమావేశంలో పాల్గొన్నారు.

అధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్



పోలీస్‌శాఖ సమీక్షలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడపరూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మే 10న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి ఉమ్మడి కడప జిల్లాలోని పోలీస్‌శాఖ తగు కృషి చేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవా సదన్‌లో పోలీస్‌శాఖ అధికారులతో ముందస్తు లోక్ అదాలత్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పోలీస్‌స్టేషన్ల వారీగా కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం రాజీ పడే కేసులను గుర్తించి నేషనల్ మెగా లోక్ అదాలత్‌కు అధికంగా వచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కడప, రాజంపేట అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసులు ప్రకాష్‌బాబు, మనోజ్ రామ్నాథ్ హెగ్డే, కడప, మైదుకూరు సబ్‌డివిజనల్ అధికారులు వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నగరంలో జరిగిన స్కామ్‌పై నిగ్గు తేల్చాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ ఆంజనేయులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

కడపమారుతీనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ 5 ఏళ్ల పాలనలో ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా దాదాపు వెయ్యి ఎకరాల భూమి కడప నగర పరిసర ప్రాంతాల్లో కబ్జాకు గురైందని, దాంతో పాటు జరిగిన సుమారు రూ.5 వేల కోట్ల స్కామ్‌పై నిగ్గు తేల్చాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ కె.ఆంజనేయులు ఆరోపించారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నగర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అంతులేకుండా సాగిన అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలను వెలికితీస్తామని మంత్రి నారా లోకేష్ బహిరంగంగా చెప్పిన సంగతి తెలిసిందే అన్నారు. ఆ కోవలో కడప నగరంలో కూడా ఆ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు సాగించిన భూ కబ్జాల దందా అంతా ఇంతా కాదని ఆరోపించారు. అదేవిధంగా కొందరు అధికారులు కడప నగరం పంచాయతీగా వున్నప్పటి నుంచి మున్సిపాల్టీ, కార్పొరేషన్‌గా మారినా ఇప్పటికీ వారు అక్కడే తిష్టవేసి మరీ విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వారు అక్రమంగా సంపాదించిన ఆస్తులు ఆకాశమే హద్దు అన్నట్లుగా వున్నాయని విమర్శించారు. లేఔట్ల కోసంగా పురాతన కట్టడాలను కూడా కూల్చేశారన్నారు. నగర మాసాపేట స్కావెంజర్స్ కాలనీలో దళితుల ఇళ్లతో పాటు ఏకంగా అక్కడున్న గుడిని, అలాగే పురాతన దొరల గోరీలను ఉక్కాయపల్లె లేఔట్ కోసం కూల్చివేశారని ఆరోపించారు. ఇదిలా వుండగా గత 20 ఏళ్లుగా నగరంలో ప్రజలు చెల్లించే పన్నులు, కుళాయి పన్నులలో, లే ఔట్లలో అవినీతి తారాస్థాయికి చేరిందని, దీనిపై విచారించాలని డిమాండ్ చేశారు. కడపలో చేపట్టే టీడీపీ మహానాడు లోపలైనా కడపలో సాగిన భూకబ్జాల నిగ్గు తేల్చి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మహానాడులో నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులు బి.హరిప్రసాద్, జయచంద్ర (టీడీపీ), సుబ్బారెడ్డి, జయకృష్ణ (కాంగ్రెస్), వై.ఎం.ప్రతాప్‌రెడ్డి (జనతాదళ్), దేవర శ్రీకృష్ణ (లోక్‌సత్తా), అవ్వారు మల్లికార్జున (జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ), ఓబయ్య (సీపీఐఎంఎల్), ప్రజాసంఘాల నాయకులు సీఆర్వీ ప్రసాద్, బీసీ గంగులు, నరసింహ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

- దళితులకు ఇచ్చిన స్థలాలు ఆక్రమించారంటూ ఆవేదన

కమలాపురంరూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయం ఎదుట ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. మండలంలోని వై.కొత్తపల్లె వద్ద దళితులకు ఇచ్చిన ఇళ్లస్థలాలను అగ్రవర్ణానికి చెందిన ఓ సర్పంచ్ ఆక్రమించుకున్నారంటూ ఆవేదన చెంది దళిత యువకుడు నరసింహులు ఒంటిపై కిరోసిన్ పోసుకుని హల్‌చల్ చేశాడు. దీంతో అందరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను ఆక్రమణ విషయంపై తహసీల్దారు శివరామిరెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించాడు. పలుమార్లు జిల్లా కలెక్టరేట్, కమలాపురం తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అర్హులైన వారికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరినా పట్టించుకోకపోవడంతో తాను ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డానని తెలిపాడు. ప్రభుత్వాలు మారుతున్నా దళితుల బాధలు పట్టించుకునే వారే లేరని వాపోయాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దళితులకు సంబంధించిన ఇళ్లస్థలాలను కబ్జాకు గురికాకుండా చూడాలని ఆయన కోరారు. కాగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.




తహసీల్దారు కార్యాలయం వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకున్న యువకుడు

ఆర్టీసీ అధికారిపై విచారణ



కడప మారుతీనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప జోన్‌లో వీఎస్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉన్నతాధికారిపై ఇటీవల వచ్చిన పలు అవినీతి ఆరోపణల విషయంగా విచారణ చేపట్టారు. ఆ మేరకు నెల్లూరు జోన్ ఆర్టీసీ విజిలెన్స్ అధికారి ధర్మతేజను విచారణ అధికారిగా ఆర్టీసీ రాష్ట్ర ఉన్నతాధికారులు నియమించారు. శనివారం స్థానిక ఆర్టీసీ ఏరియా ఆసుపత్రి ఆవరణంలో గల ఆర్టీసీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కడప జోన్ వ్యాప్తంగా గల 40 మంది పోలీస్ కానిస్టేబుళ్లను గోప్యంగా విచారించారు. కాగా సేకరించిన సమాచారాన్ని ఆర్టీసీ రాష్ట్ర ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం.



CHANGE OF NAME

I, LAKSHMI V(Old Name),R/o. D.No. 20/947-3, CO-OPERATIVE COLONY, KADAPA, YSR District, AP, have changed my name as GANJI LAKSHMI VENKATESHWARAMMA (New Name)
AJC-233685

TO-LET

VERY SPACIOUS COMMERCIAL SPACE G+2(4000SFT)WITH BASEMENT PARKING IS AVAILABLE AT CHENNUR BUS STAND, KADAPA, A.P., 70329 13073, 79045 06151
AJC-233862

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA-227149

ప్లాటు కొనబడును

నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డు, కనుపర్తిపాడు, కాకుటూరు, బుజబుజ నెల్లూరు, పైపాడు రోడ్డు ఏరియాలోని ప్లాటు కొనబడును. సం.ప్ర. 93464 48054, 79812 46665
AJR-205748

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

శ్రీరామచంద్రుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలి



కల్యాణోత్సవం సందర్భంగా అన్నదానం చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): శ్రీరామచంద్రుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ఆకాంక్షించారు. శనివారం రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాలపురంలో గల సందీప్ నగర్‌లో సీతారాముల కల్యాణోత్సం, అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ ఆహ్వానం మేరకు సీతారాముల కల్యాణోత్సవానికి సుగవాసి ప్రసాద్‌బాబు హాజరై స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధి కూలి రూ.600కు పెంచాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలి రూ.600కు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం రైల్వేకోడూరు మండలం ఉర్లగట్టుపోడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలకు సిద్ధమన్నారు.

'తప్పుడు వాదనలు కాంగ్రెస్ మానుకోవాలి'



నిరసన తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు తప్పుడు వాదనలు మానుకోవాలని కోడూరు మండల బీజేపీ అధ్యక్షుడు సాయం శ్రీధర్ హితవుపలికారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీల పాత్రపై కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరిపిన తర్వాతనే వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. కుంభకోనం సాయి ఆచారి, వాకచర్ల సుబ్బరావు, రాము, సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.10116 విరాళం



విరాళం అందజేస్తున్న శైలజ

నందలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి అన్నదాన ట్రస్టుకు నందలూరు దళితవాడకు చెందిన పత్తూరు శైలజ రూ.10116 విరాళాన్ని ట్రస్టు కోశాధికారి చక్రాల రామసుబ్బన్నకు శనివారం అందజేశారు. ట్రస్టు సభ్యులు లంకయ్యగారి సుబ్బరామయ్య, ప్రైవేటు ఉపాధ్యాయులు బలరాం, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

30 నుంచి జయంతి ఉత్సవాలు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట బ్రాహ్మణ అద్వైత సమితి ఆధ్వర్యంలో పాత పోలీసులైను వీధిలో ఉన్న శంకరమఠంలో ఈనెల 30 నుంచి మే నెల 2వ తేదీ వరకు జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది వల్లభరావు తెలిపారు. కావున భక్తులందరూ హాజరై స్వామి వారి కృపను పొందాలని తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

పెనగలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని చక్రంపేట హైస్కూల్ హెచ్ఎం గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు అన్వర్‌బాషా, హరిప్రసాద్, రికార్డు అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

పతనమవుతున్న ధరలతో రైతులకు నష్టం

● గిట్టుబాటు ధరలపై ప్రభుత్వ కాలయాపన

సంబేపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, ఉద్యాన పంటల్లోనూ రైతులు ఒకే రకం పంటలు సాగు చేస్తున్నారు. దీంతో పంట దిగుబడిపై ధరల ప్రభావం పడుతోంది. పంట పెట్టుబడులు కూడా రాక రైతులకు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ ప్రభుత్వాలు గొప్పలు చెప్పడం తప్ప ఆ దిశగా చొరవ చూపడం లేదంటున్నారు. మంచి దిగుబడి వచ్చినా ధరలు లేక నష్టాలు బాట తప్పడం లేదు. ప్రభుత్వాలు ధరలు నియంత్రణ చేపట్టి రైతులకు ప్రత్యామ్నాయం చూపాల్సిన ఆవశ్యకత ఉంది. అయితే ఆ దిశగా ప్రభుత్వాలు పట్టించుకోలేదని చెప్పవచ్చు. ఒక రైతు ఓ పంట సాగులో మంచి లాభాలను ఆర్జించడంతో మిగిలిన రైతులంతా అదే రకం పంట సాగుపై మక్కువ చూపుతున్నారు. దీంతో ధరలు పతనమవుతున్నాయి. రాయలసీమ జిల్లాల్లో ప్రధానంగా ఉద్యాన పంటల కింద టమోటా, దోస, వంగ, కర్బూజా సాగు చేస్తారు. వ్యవసాయ పంటల కింద వేరుశనగ, ఉలవ సాగు చేస్తారు. రైతులు పంట సాగుతో నష్టపోకుండా ఆదాయం ఆర్జించాలంటే వివిధ రకాల పంటల సాగులు చేపడితే మంచిదని అధికారులు చెబుతున్నారు.

జాక్‌పాట్ పంట దోస, కర్బూజా

దోస, కర్బూజా రైతులకు జాక్‌పాట్ పంటలు. పంట దిగుబడి సమయం తక్కువ కాలం. 60 నుంచి 65 రోజుల్లో పంట వస్తుంది. ధర పలికితే మంచి ఆదాయమే వస్తుంది. ఎక్కువ కాలం నిలువ చేసుకొనే సమయం ఉండదు. ఆ రోజుకు ఆరోజు మార్కెట్ ధరలే ఆ రైతు అదృష్టాన్ని నిర్ణయించాయి. గత ఏడాది మంచి దిగుబడితో పాటు దోస టన్ను రూ.35 నుంచి 40 వేలు పలకడంతో మంచి ఆదాయం వచ్చింది. దీంతో ఈ పంటను రైతులు విపరీతంగా సాగు చేశారు. ప్రస్తుతం తెగుళ్ల సోకి తీవ్రంగా నష్టపోయారు. పెట్టుడులు కూడా రాక నిరాశ మిగిలింది. సంబేపల్లె మండలంలో దోస 50 హెక్టార్లలో కర్బూజా 26 యాక్టర్లలో సాగు చేశారు.



మాదంవాండ్లపల్లెలో సాగులో ఉన్న టమోటా, దుద్యాలవడ్లపల్లెలో దోస సాగు

వర్షాధార వేరుశనగను తలపించిన ఉలవసాగు

వేరుశనగలో ఆశించిన రీతిలో రైతులకు దిగుడి రాక నష్టాలు వచ్చాయి. దీంతో రబీ సాగులో వర్షాధార వేరుశనగ పంట సాగును తలపించేలా ఉలవ సాగు చేపట్టడం విశేషం. సంబేపల్లె మండలంలో 2283 హెక్టార్లలో ఈ ఏడాది ఉలవసాగు చేపట్టారు. ఒకప్పుడు ఉలవక్వింటాల్ ధర రూ.6 నుంచి 8 వేలు ఉండేది. ఈ ఏడాది ఉలవ సాగు ఎక్కువ కావడంతో 3 నుంచి 4 వేలకు ధర పడిపోవడమే ఇందుకు నిదర్శనం.

ప్రత్యామ్నాయం చూపాలి



టమాటా ధరల పతనంతో నష్టపోతున్నాం. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించి ఆదుకోవాలి. దీంతో పాటు దిగుబడి వచ్చే సమయంలో ధర లేని సమయంలో టమోటా నిల్వ ఉంచుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌ను నిర్మించాలి. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలంటే ఇదే ప్రత్యామ్నాయ మార్గం.

\- మోడెం వెంకటేశ్, మాదంవాండ్లపల్లె, సంబేపల్లె

ఒకే రకం పంట సాగుతో నష్టం తప్పదు

రైతులు ఒకే రకం పంటలు అధికంగా సాగు చేయడంతో నష్టపోతున్నారు. ఒక రైతు వివిధ రకాల పంటలను సాగు చేస్తే ఏదో ఒక పంటలో అయినా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రతి రైతు నష్టపోకుండా ఉండేందుకు ఇదే సరైన మార్గం. ప్రభుత్వం కూడా గిట్టుబాటు ధర కల్పించాలి.

\- హుస్సేన్‌సాబ్, ఏఎస్‌వో, సంబేపల్లె

టమోటాకు కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేస్తే అన్నదాతలకు ఎంతో మేలు

రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా రైతులకు కాసులు కురిపించే పంట ఏదైనా ఉందంటే అది టమోటే. ఏడాదిలో ఏదో ఒక రెండు, మూడు నెలలు ధర పలకడం 30 కేజీల బాక్స్ రెండు వేల రూపాయలు ధర పలకడం లక్షల్లో రైతులకు ఆదాయాలు రావడంతో రైతులందరూ ఈ పంట సాగుపై విపరీతంగా మక్కువ చూపుతున్నారు. తీరా ధరలు లేక రూ.70కు, రూ.80కు ధర పడిపోవడంతో పంట పెట్టుబడి రాక నష్టాలను చవిచూస్తున్నారు. ఒక ఏడాది ఆదాయం వస్తే నాలుగు సార్లు పంట సాగు చేసి నష్టపోతున్నారు. కావున ప్రభుత్వం టమోటా రైతులను దృష్టిలో పెట్టుకుని దిగుబడి వచ్చే సమయంలో టమోటా నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ధరలు వచ్చినప్పుడు వాటిని అమ్ముకోవడంతో ఆదాయం వస్తుంది. సంబేపల్లె మండలంలో ఎండాకాలంలో 125 హెక్టార్లలో టమోటా సాగు చేయడం విశేషం.

స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్న చమర్తి

రాజంపేట టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్ఎస్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ర్యాలీ ఉంటుందన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను కార్మికులకు అందజేయాలి

పెనగలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ఇళ్లల్లో ఉపయోగించే ప్లాస్టిక్ వ్యర్థాలను కార్మికులకు అందజేయాలని జడ్పీ సీఈవో మైథిలి అన్నారు. శనివారం పెనగలూరు పంచాయతి పరిధిలో స్వచ్ఛభారత్, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె అధికారులతో కలిసి పర్యటించారు.



రాజంపేటలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్న చమర్తి జగన్‌మోహన్‌రాజు



పెనగలూరులో మానవహారంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో మైథిలి

ఘనంగా స్వాతంత్ర్య సమర యోధుడు గౌతు లచ్చన్న వర్ధంతి



లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నందలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతులచ్చన్న వర్ధంతిని శనివారం అరవపల్లెలోని స్థానిక బచ్చు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం విభ ఎరుడైట్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ బచ్చు జయభాస్కర్‌రావు మాట్లాడుతూ లచ్చన్న విలువలతో కూడిన రాజకీయాలను నడిపారన్నారు. లయన్ మన్యం రామ్మోహన్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న బ్రిటీషువారిపై ఉద్యమించి పలుమార్లు జైలుకు వెళ్లారన్నారు.

దెబ్బతిన్న అరటితోటల పరిశీలన



దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి జైభరత్‌రెడ్డి


సిద్దవటం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మాచుపల్లెలో దెబ్బతిన్న రైతు సుబ్బరాయుడు అరటితోటను శనివారం ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు.

వడదెబ్బ నివారణకు జాగ్రత్త వహించండి

● డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

సిద్దవటం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వడదెబ్బ నివారణకై పలు సూచనలు, సలహాలు అందించామని పి.కొత్తపల్లె ప్రైమరీసెంటర్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి శనివారం మాట్లాడుతూ 104 వైద్యసేవలో భాగంగా చలమారెడ్డిపల్లె గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి అధిక ఉష్ణోగ్రత తీవ్రత వల్ల వడదెబ్బ నివారణకొరకు మంచినీరు, కొబ్బరి బోండాలు, శీతలపానీయాలు, మజ్జిగ ఎక్కువ శాతం తీసుకోవాలని ఉపాధిహామీ కూలీలు పనులు చేసేటప్పుడు వడదెబ్బ నివారణకై ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీరు ఎక్కువ శాతం తీసుకొని జాగ్రత్త వహించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులవారిని గుర్తించి మందుబిల్లలు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ జెడ్పీటీసీ జయమ్మ

సుండుపల్లె, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని మాజీ జెడ్పీటీసీ యర్రపురెడ్డి జయమ్మ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ది అరిజన్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గుణాత్మక విద్యనందించేందుకు స్వర్గీయ యర్రపురెడ్డి రవీంద్రారెడ్డి ఎంకేఆర్ జూనియర్ కళాశాలను స్థాపించారన్నారు. ఎంఈవో రవీంద్రనాయక్, ప్రిన్సిపాల్ శైలజ, పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బరాజు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 సంవత్సరానికి గాను రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. వివిధ యూనిట్లకు సంబంధించి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెడికల్ షాపు, మెడికల్ ల్యాబ్, ఎలక్ట్రికల్ బ్యాటరీ, రీచార్జింగ్, యూనిట్ ఎలక్ట్రిక్, ఆటో ప్యాసింజర్, కార్, గూడ్స్ ట్రక్ తదితర యూనిట్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 11 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభమైందన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

● ప్రభుత్వ ఆసుపత్రిలో విన్యాసాలు చేసి చూపించిన ఫైర్ సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగి నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఫైర్ సిబ్బంది ఆసుపత్రిలో విన్యాసాలు నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అగ్నిప్రమాదంలో జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఫైర్ ఆఫీసర్ రామయ్య, సిబ్బందితో విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు విద్యుత్ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగితే ఎదుర్కోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ నీలోఫర్‌బేగం, డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ రామయ్య, సిబ్బందితో విన్యాసాలు నిర్వహించారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

● చైల్డ్ ప్రొటెక్షన్ అధికారిణి రామలక్ష్మి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై ప్రజలు అవగాహన కల్గి ఉండాలని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారిణి రామలక్ష్మి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు సచివాలయం-1 పరిధిలో బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, కోడూరు సచివాలయం-1 మహిళా సంరక్షణ కార్యదర్శి సుజాత, అంగన్వాడీ కార్యకర్త కాత్యాయని, సచివాలయం-2 ఆత్మరక్షణ కార్యదర్శి పీ.పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

చిరుత మృతి సంఘటనలో అమాయకులపై కేసులా?

●రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రంగారెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చిరుతపులి వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు రైతులు సమాచారం ఇస్తే సమాచారం ఇచ్చిన వారిపైనే కేసులు నమోదు చేయడం ఏమిటని ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన రాయచోటి పట్టణం రాయుడుకాలనీ వద్ద రైతులతో కలిసి మీడియాతో మాట్లాడారు. మదనపల్లె మండలంలోని పొన్నేటిపాలెం సమీపంలో వేటగాళ్లు వేసిన ఉచ్చులో చిరుతపులి చిక్కుకుని చనిపోయిందన్నారు. ఈ విషయాన్ని కొంత మంది రైతులు ఫారెస్టు అధికారులకు తెలపగా వారు సకాలంలో స్పందించకుండా సమాచారం ఇచ్చిన వారిపై కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. అధికారులు తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి గంగాధర్‌రెడ్డి, వెంకట్రమణారెడ్డిలపై కేసులు బనాయించడం దారుణమన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కింద రెండు ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరు

గాలివీడు, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ కింద రెండు ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరైనట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్‌బ్యాంక్, గ్రామీణ బ్యాంక్ ఒక్కొక్కటి చొప్పున రెండు యూనిట్లు మంజూరయ్యాయన్నారు. యూనిట్ విలువ రూ.3 లక్షలు కాగా ప్రభుత్వం రూ.ఒక లక్ష సబ్సిడీ ఇవ్వగా, బ్యాంక్ రూ.1.85 లక్షలు రుణం మంజూరు చేయనున్నది. మిగిలిన రూ.15 వేలు లబ్ధిదారుడు చెల్లించి ఎలక్ట్రిక్ ఆటోను పొందాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులుఆధార్, కులధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మే 20లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రైల్వేకోడూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యురాలు శాంతి తెలిపారు. శనివారం ముక్కావారిపల్లె జడ్పీ హైస్కూలులో నోటి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రేపు 6వ తరగతికి ప్రవేశ పరీక్ష

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన 6వ తరగతి ప్రవేశం కొరకు రేపు 21న సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజకుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లు పొంది పరీక్షకు హాజరుకావాలన్నారు. 9 గంటలకు ఏపీ మోడల్ స్కూల్‌లో హాజరుకావాలన్నారు.

రాజంపేటలో సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌ను కలిసిన కేఎంఎల్ నరసింహ

రాజంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డివిజనల్, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని రాజంపేట కేఎంఎల్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కేఎంఎల్ నరసింహ శనివారం అన్నమయ్య కలెక్టర్ చామకూరి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు. రాజంపేట పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతిరోజు వేలాది మంది వస్తుంటారని, వారికి మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదన్నారు. దీనివల్ల ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలతో క్రిమికీటకాలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు.

విజయ గణపతి, జ్ఞాన సరస్వతి విగ్రహాల ఆవిష్కరణ



ప్రత్యేక అలంకరణలో విగ్రహాలు

నందలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల జూనియర్ కళాశాలలో నూతనంగా ప్రతిష్ఠింపబడిన విజయ గణపతి జ్ఞానసరస్వతిదేవి విగ్రహాలను శనివారం ఆవిష్కరించారు. విద్యార్థులకు చదువులో విజయాలను ప్రసాదించాలని పూజించారు. శిల్పి ఆనందాచారి, రాజేశ్వరి దంపతులు గణపతి విగ్రహాన్ని, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ మీనరగండ నాగేంద్రప్రసాద్, శ్రీదేవి దంపతులు జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

చిట్వేలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు ఎంతో నిబద్ధలతో, క్రమశిక్షణతో సేవాభావాన్ని అలవరుచుకోఆలని చిట్వేలిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏబీఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం మండలంలోని స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. స్కౌట్స్ మాస్టర్‌లు ఎం.నవీన్‌కుమార్, జి.చిన్నబాబు, గైడ్ కెప్టెన్లు బి.శిల్పకళ, పి.వెంకటసుహాసిని ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చంద్రయ్య, దుర్గరాజు, బాలాజినాయక్, రాజశేఖర్, షబ్బీర్‌అహ్మద్ పాల్గొన్నారు.



మరమ్మతులకు మోక్షమెప్పుడో...?

- మూడేళ్ల క్రితం తెగిన హంద్రీ-నీవా కాలువ
- రాకపోకలకు ఇబ్బందులు
- ఆయకట్టంతా బీడుగానే...
- ఈ ప్రభుత్వంపైనే ఆశలు


గండి పడిన హంద్రీ-నీవా కాలువ


బీడుగా మారిన ఆయకట్టు భూములు

పెద్దమండ్యం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలంలో గండ్లు పడిన చెరువులు, కాలువల అభివృద్ధి పనుల మరమ్మతులకు మోక్షమెప్పుడోనని రైతులు ఎదురుచూస్తున్నారు. భూగర్భ జలాలు పెంచే చెరువులు, హంద్రీ-నీవా కాలువలకు వర్షాకాలంలో గండ్లు పడ్డాయి. తూతూమంత్రంగా తాత్కాలిక మరమ్మతు పనులతో సరిపెట్టారే కానీ శాశ్వత పనులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. మూడేళ్లుగా మరమ్మతు వ్యవహారం గాలికి వదిలేశారు. అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు రావడం లేదు. తద్వారా ఆ ప్రాంతాల రైతులు నష్టపోతున్నారు.

మూడేళ్ల క్రితం నివర్ తుఫాన్ ధాటికి పెద్దమండ్యం పరిధి దొమ్మరపల్లి సమీపంలో హంద్రీ-నీవా కాలువకు గండి పడింది. దీంతో కాలువపై నిర్మించిన బ్రిడ్జి పక్కన ఉన్న గ్రామాలకు వెళ్లే దారి కూడా ధ్వంసమైంది. ఆయా గ్రామ ప్రజలు ఏడాదిగా దారి సమస్యతో ఇబ్బందులు పడ్డారు. దొమ్మరపల్లెలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు ప్రతిరోజూ అవస్థలు పడేవారు. దీంతో అధికారులు చర్యలు తీసుకుని గండి పడిన కాలువను తాత్కాలిక మట్టి పనులతో చేసి దారి ఏర్పాటు చేశారు. అది ఇప్పుడు మళ్లీ ధ్వంసం కావడంతో.. వర్షాకాలం ప్రారంభమైతే ఈ మార్గంలో మళ్లీ ప్రజలకు కష్టాలు తప్పవని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

గతంలో కురిసిన వర్షాలకు పలు చెరువులు, కాలువలకు గండ్లు పడ్డాయి. మండలంలోని పెద్దమండ్యం పరిధిలోని గెల్లంవారిపల్లెకు సమీపంలోని కుషావతి నదిపై నల్లరాతిమడుగు ప్రాజెక్టు పనులు జరిగాయి. అక్కడ కుషావతినది నుంచి చెరువుకిందపల్లి లంజుకుంటచెరువు, పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాలకుంట కాలువలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం తుఫాన్ సమయంలో నది ఉధృతి పెద్దమండ్యం పాతచెరువు కాలువపై సాగడంతో మాసాబీబీ దర్గా సమీపంలో కాలువకు గండి పడింది. అప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక మట్టి పనులు చేయించారు. కానీ కాలువ లీకేజీలు ఆపలేకపోయారు. ఈ వర్షాకాలంలో కురిసిన వానలతో ఆ మూడు చెరువులకు వర్షపు నీటితో జలకళ నెలకొంది. రైతులు హర్షించినా ఆయకట్టు భూముల్లో పంటలు సాగుచేసేందుకు సిద్ధపడలేదు. తాత్కాలిక పనులు చేసిన కాలువలకు మళ్లీ గండ్లు పడతాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఆ మూడు చెరువుల కింద ఆయకట్టు భూములు బీడుగా మారాయి. కేవలం 100 మీటర్ల కాలువకు శాశ్వత అభివృద్ధి పనులు చేయడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వచ్చాయి. గతంలో రబీలో వరి పంట చివరి దశలో పంటలకు నీరందకపోవడంతో ఎండిపోయాయి. దీంతో పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాలకుంట కింద ఆయకట్టు సుమారు 90 ఎకరాల్లో బీడుగా మారింది. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఈ వేసవిలో ఈ కాలువలో గండి పూడ్చి శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దొమ్మరపల్లి సమీపంలోని హంద్రీ-నీవా కాలువకు గండి పడిన ప్రాంతంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


గండి పడిన సమయంలో విద్యార్థుల కష్టాలు (ఫైల్)

నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తాం

గండి పడిన చెరువులు, కాలువ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాము. మండలంలో గండ్లు పడిన అభివృద్ధి పనుల కోసం రూ.6.5 కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. నిధులు మంజూరు చేసిన వెంటనే అభివృద్ధి పనులు చేపడతాం.

- శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జ్ ఏఈఈ
ఇరిగేషన్ శాఖ, తంబళ్లపల్లి

ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపుపై అవగాహన ఉండాలి

- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్


వ్యర్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వ్యర్థాల శాస్త్రీయ తొలగింపుపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం అనే కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ శ్రీధర్ పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నేడు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం అనే థీమ్‌తో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, పెద్ద పంచాయతీల్లో ప్రతిరోజూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ జరుగుతుందని, మిగిలిన పంచాయతీల్లో వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై ఎస్‌హెచ్ గ్రూపులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని, వారి ద్వారా ప్రజల దగ్గర నుంచి ఈ-వ్యర్థాలను సేకరిస్తున్నామన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో శనివారం 170 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించబడ్డాయని తెలిపారు. వాటిని ప్రైవేటు కంపెనీలకు అందిస్తే వారు రీసైక్లింగ్ చేస్తారన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలను ఎదుర్కొనే పద్ధతులపై అవగాహన


మంటలను ఆర్పే విధానాన్ని చూపుతున్న దృశ్యం

పీలేరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పద్ధతులు, ఉపయోగపడే సాధనాలు, పాటించాల్సిన చిట్కాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనిల్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పీలేరు అగ్నిమాపక సిబ్బంది శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు, వాటి నివారణ, ఎదుర్కొనే విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ అంతస్తుల భవనాలలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా నివారించాలి, మంటల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. గ్యాస్, ఆయిల్, విద్యుత్ తీగల మంటలను ఆర్పే విధానాలను ప్రయోగాత్మకంగా డెమో రూపంలో ప్రదర్శించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే 101, 08584-244399, 9963736587 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి మస్తాన్, సిబ్బంది నాగిరెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశ్, రెడ్డిశేఖర్, మహబూబ్ బాషా, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

19పీఎల్ఆర్ వీఎల్‌కే2: వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రమాదాల సమయాన భయపడొద్దు..

వాల్మీకిపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు సంభవించినపుడు అప్రమత్తంగా ఉండటం ద్వారా బయట పడవచ్చునని వాల్మీకిపురం అగ్నిమాపక కేంద్ర అధికారి బాబయ్య తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, డాక్టర్లు సోని, శివాణి, ఆసిఫ్, జ్ఞానేశ్వర్, ఫైర్‌మెన్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ అధ్యాపకుల పోస్టుల రద్దు.. వద్దు!

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులు రద్దు చేయ రాదంటూ మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వ్యాయామ అధ్యాపకులు శనివారం ఆ కళాశాల ఇన్‌చారి ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీలు మురళీ, నరేష్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లోని జూనియర్ లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను రద్దు చేయడం బాధాకరం అన్నారు. ఈ విషయంపై ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు, విద్యా శాఖమంత్రి నారాలోకేశ్‌కు విన్నవించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలోదేవకమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు తాజా సర్టిఫికెట్లు పొందాలి

- డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలపై బదిలీ కోరే ఉపాధ్యాయులు వారి అనారోగ్యానికి సంబంధించిన తాజా సర్టిఫికెట్లను పొందాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వుల మేరకు ఈ ఏడాదిలో జరగబోయే ఉపాధ్యాయ బదిలీల్లో ప్రతిపాదిత మార్గదర్శకాలను అనుసరించాలన్నారు.

కడప రిమ్స్‌లో ఏర్పాటు చేసిన అదనపు డైరెక్టర్లు, వైద్య విద్యా సూపరింటెండెంట్‌లు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు (మూడు రోజుల వ్యవధిలో) ఆరోగ్య ధ్రువపత్రాలు జారీ చేస్తారని తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ధ్రువపత్రాలు పొందాలని తెలిపారు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. దీనిపై వివరణాత్మక మార్గదర్శకాలు త్వరలో జారీ చేస్తారన్నారు. ఆరోగ్య కారణాలపై బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు సంబంధిత జిల్లా వైద్య మండలి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయులు తిరుపతిలోని ఎస్వీఆర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి, ఉమ్మడి కడప జిల్లా ఉపాధ్యాయులు కడప రిమ్స్ ప్రభుత్వాసుపత్రి నుంచి తాజా వైద్య ధ్రువపత్రాలను పొందాలని తెలిపారు.

రేపు ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరే విద్యార్థులకు సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు స్థానిక ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి ఉదయం 8. 30కు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌లో ఫొటో క్లియర్‌గా లేకపోయినా ఇంకేదైనా ఇబ్బంది వచ్చినా సరిచేసుకొనుటకు విద్యార్థులు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకు రావాలని సూచించారు.

బేకరీలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

రామసముద్రం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ బేకరీలో హనీ కేక్ తిని ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురైన సంఘటనకు సంబంధించి అన్నమయ్య జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షమీంబాషా శనివారం ఆ బేకరీలో తనిఖీ లు నిర్వహించారు. పరికరాలు, వస్తువుల నాణ్యతను పరిశీలించారు. శాంపిల్స్ సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల తయారీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, బేకరీలు, హోటళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా ఫుడ్‌సేఫ్టీ అధికారులఅనుమతి తీసుకోవాలన్నారు. అపరిశుభ్ర, అనారోగ్యకరమైన తినుబండారాలను, ఆహారాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళపై దాడి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పొలంలో రాళ్లు వేయడాన్ని అడ్డుకున్నందుకు ఓ మహిళపై దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం, మాలేపాడు పంచాయతీ కతోళ్లపల్లెకు చెందిన గుర్రప్ప భార్య గోపెమ్మ(40) శనివారం తన పొలంలో ఉండగా అదే గ్రామానికి చెందిన కదిరప్ప, సరసమ్మ, భాస్కర కర్రలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. కుటుంబసభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రాజెక్టుల రూపకల్పనలో నైపుణ్యం సాధించాలి

కలకడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సైన్స్ ప్రాజెక్టుల రూపకల్పనలో నైపుణ్యం సాధించాలని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. కలకడ ఆదర్శ పాఠశాల్లో శనివారం ప్రారంభమైన అటల్ బూత్ క్యాంప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిద్ధాంతం, అభ్యాసం మధ్య అంతరం తగ్గడానికి ఇలాంటి శిక్షణ దోహదపడుతుందన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత, అన్వేషణాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మలాంషా వలి మాట్లాడారు. ఎంఈవో మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తప్పులను కప్పిపుచ్చుకోవడానికే రైతులపై కేసులు

- జనసేన కో ఆర్డినేటర్ రాందాస్‌చౌదరి


ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలుపుతున్న జనసేన నాయకుడు రాందాస్‌చౌదరి, సీపీఎం శ్రీనివాసులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చిరుత మృతి ఘటనలో అటవీశాఖ అధికారులు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే రైతులపై కేసులు నమదు చేశారని జనసేన రాయలసీమ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి మండిపడ్డారు. శనివారం స్థానిక అటవీశాఖ రేంజర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులను ఆయన పరామర్శించారు. ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావుతో మాట్లాడుతూ ఉచ్చులు వేసిన వేటగాళ్లను అరెస్టు చేయకపోగా, 8 గంటల పాటు బందీగా వున్న చిరుతను కాపాడటంలో అటవీశాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. దీని తప్పుదోవ పట్టించేందుకు ఏడుగురు రైతులపై కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. ఈ విషయమై జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతా మన్నారు. రైతు కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పొన్నేటిపాళెం ప్రాంతంలో చిరుత సంచారంపై పది నెల లుగా గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారని, కాని అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. తప్పు చేసిన అధికారులనే విచారణ అధికారులుగా నియమించడంతో దోషులు అవలీలగా తప్పించుకుం టార న్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి జంగాల శివరామ్, రైతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల వివరాల నమోదు పూర్తి చేయాలి: జేడీఏ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

వాల్మీకిపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ, రైతుల వివరాల నమోదు తదితరాలు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. శనివారం వాల్మీకిపురం రైతు సేవా కేంద్రంలో కలికిరి, గుర్రంకొండ, పెద్దమండ్యం, వాల్మీకిపురం మండలాలలో పనిచేస్తున్న రైతు సేవా కేంద్ర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మర్ క్రాప్, మట్టి నమూనాల సేకరణ తదితరాలపై చర్చించి సకాలంలో పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వాణిశ్రీ, ఏవోలు హేమలత, రమేష్ నాయక్, వెంకటమోహన్, నవీన్‌కుమార్, సురేష్‌బాబు, మమతారెడ్డి, రత్నమ్మ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల మృత కళేబరాలతో వైసీపీ రాజకీయాలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ములకలచెరువు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గోవుల మృతకళేబరాలతో కూడా వైసీపీ రాజకీయాలు చేస్తోందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తి కొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి ఎర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శని వారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కరుణాకర్‌రెడ్డి, వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మరన్నారు. గోశాల లో ఆవు లు మృతి చెందాయని అసత్య ప్రచారాలు చేసిన వైసీపీ నేతలు వెంకటేశ్వర స్వామికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పెద్దమండ్యం మాజీ కన్వీనర్ సిద్ధవరం ప్రసాద్, నేతలు డేరంగుల నారాయణ, గంగాదేవి, భజంత్రి రామాంజులు, మాజీ ఎంపీపీ సిగి నర సింహులు, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు చాంద్‌బాషా, సుబ్బినాయుడు, ఫజులు, రషీద్, పాస్టర్ శ్రీనివాసులు, పాల రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలను పాటిస్తే ప్రమాదాల నివారణ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, టూటౌన్ సీఐ రామచంద్ర, ఎస్ఐ లు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రహదారి నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం అవుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని, బైక్‌లు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించరాదని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రెగ్యులర్‌గా పోలీసుల తనిఖీలు ఉంటాయని, జరిమానాలు తప్పక విధిస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఇందులకు మదనపల్లె ప్రజలు సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

వెయ్యి రోజుల సంరక్షణతో శిశువుకు రక్షణ కవచం


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీధర్ రావు

పెద్దమండ్యం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) వెయ్యి రోజుల సంరక్షణే శిశువుకు రక్షణ కవచమని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. మండలంలోని పెద్దమండ్యం, గుడిసెవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పఖ్వాడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు గర్భిణులు, తల్లుల కు పోషక విలువలపై అవగాహన కల్పించాల న్నారు. కేంద్రాలలో చిన్న పిల్లల ఆరోగ్యంపై ప్ర త్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి, నౌజియా బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పఖ్వాడా కార్యక్రమా లను నిర్వహిస్తున్నారు. మద్దయ్యగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో మాట్లాడుతూ 1000 రోజుల సంరక్షణను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు మొబైల్ యాప్స్, లబ్ధిదారుల వివరాల నమోదుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించారు.

అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరించుకోండి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవడానికి రాయితీ ఇస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గృహ విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు ఎస్పీడీసీఎల్ 50 శాతం రాయితీ ఇస్తోందన్నారు. జూన్ 30 వరకు ఈ అవకాశం వినియోగించుకునేందుకు గడువు ఉందన్నారు. అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీతో 1 కిలోవాట్‌కు రూ.1,250, 2 కిలోవాట్లకు రూ. 2,450, 3 కిలోవాట్లకు రూ.3,650, 4 కిలోవాట్లకు రూ.4,850, 5 కిలోవాట్లకు రూ.6,050 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ అవకాశాన్ని గృహ విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

వైద్యులపై దాడి ఆటవిక చర్య..

పీలేరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):వైద్యులపై దాడి చేయడం ఆటవిక చర్య అని భారతీయ వైద్యుల సంఘం ఏపీ అధ్యక్షుడు డాక్టర్ నంద కిశోర్ తెలిపారు. శనివారం పీలేరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి లో పీలేరు ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీలేరు ఐఎంఏ శాఖ ప్రతి నెల అవగాహన సదస్సు నిర్వహించి అధునాతన చికిత్సలపై వివరించడం అభినందనీయమన్నారు. కొత్త ఆసుపత్రులకు అనుమ తులు, పాత వాటి రెన్యువల్ ప్రాసెస్‌ను సులభతరం చేయాలని కోరారు. పీలేరు శాఖ ప్రారంభించి ఏడాదిలోనే 69 మంది వైద్యులకు ఐఎంఏలో సభ్యత్వం ఇవ్వడం అభినందనీ యమన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, డాక్టర్ సేవాకుమార్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ యర్రంశెట్టి పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ నిరుద్యోగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 9యూనిట్లు మంజూరయ్యాయన్నారు. 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో ఏప్రిల్ 14 నుంచి మార్చి 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలో ఎస్సీ కేటగిరీకి చెందిన నిరు ద్యోగులు అధికశాతం ఉండగా, కేవలం 9 యూనిట్లు మాత్రమే కేటాయించడంపై గగ్గోలు పెడుతున్నారు. గతంలో దాదాపు 40 యూనిట్ల వరకు ఇచ్చే వారని, ఇప్పుడు కేవలం 9 యూనిట్లు కేటాయించి ఎవరికి ఇస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆలోచించి యూనిట్ల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులపై జనసేన నేత ఆరా..

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై తంబళ్లపల్లె నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ పోతుల సాయినాథ్ ఆరా తీశారు. శనివారం మండల స్థాయి అధికారులను కలిసిన ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు గ్రామ స్థాయిలో అర్హులకు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని. ఈ ప్రక్రియలో జన సేన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జ్ఞానాంబిక విద్యార్థి విజయకేతనం


ప్రతిభ చూపిన జ్ఞానాంబిక విద్యార్థిని

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మదనపల్లె పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జ్ఞానాంబిక జూనియర్ కళాశాల విద్యార్థి విజయకేతనం ఎగురవేసిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. ఇందులో బి. సద్విక‌రాజ్ 3345 పర్సంటైల్ సాధించి ఆల్ ఇండియా లెవల్‌లో ర్యాంకు సాధించారన్నారు. అలాగే ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో సీనియర్ ఇంటర్‌లో 982 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.


ప్రజానాయకునికి
జన్మదిన శుభాకాంక్షలు
76 ఏళ్ళ వయసులోనూ పాతికేళ్ళ యువకుడిలా
తెలుగు రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం అలుపెరుగని యోధుడుగా
అహర్నిశలు శ్రమిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు
మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
జన్మదిన శుభాకాంక్షలు.
అకుంఠిత దీక్షాదక్షతలతో
రాజకీయాల్లో అపర చాణక్యుడై
విరాజిల్లుతున్న మహా నాయకుడా..!
వర్ధిల్లు వెయ్యేళ్ళు
యశో కీర్తి చంద్రికల కిరీట ధారివై..
తెలుగుదేశం
దగ్గుబాటి వెంకటేశ్వర రావు
తెలుగుదేశం పార్టీ నాయకులు, పీలేరు నియోజకవర్గం

రోడ్డుప్రమాదంలో ఉపాధ్యాయురాలికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కారు ఢీ కొనడంతో ఓ ఉపాధ్యాయురాలు గాయాలపాలైంది.. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం, ఎస్బీఐ కాలనీకి చెందిన ఆర్. హేమలత (56) ఉపాధ్యాయురాలు. కురబకోట మండలం అంగళ్లు పంచాయతీ, సర్కారు తోపు వద్ద బస్సుదిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొనడంతో ఆమె ఎడమకాలు విరిగింది. కారు యజమాని ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):నేషనల్ టెస్టు ఏజెన్సీవారు శనివారం విడుదల చేసిన ఫలితాల్లో మదనపల్లె, ప్రశాంత్‌నగర్‌లోని కృష్ణారెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తెలిపారు.ఇందులో ఎ.వెంకట సాయిదీపక్ 93.68,కె. సాయి సుదీక్ష93.48,డి. పవన్‌తేజ్‌రెడ్డి 93.28,ఎస్.స్పందన 89.77 పర్సంటైల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను అభినందించారు.

సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగిస్తున్న అతి తక్కువ మైక్రాన్ల ప్లాస్టిక్ కవర్లను నిషేదిద్దామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణమండపం నుంచి విద్యార్థులు, ప్రజలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌తో పాటు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఇంటి ముందు ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రతి పౌరుడు బాధ్యతగా స్వీకరించి స్వచ్ఛ ఆంధ్రకు తోడ్పాటునివ్వాలన్నారు. అనంతరం జడ్పీ హైస్కూల్లో ప్లాస్టిక్ రహిత నిత్యావసర వస్తువుల ప్రదర్శన తిలకించి, ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, మోహనవల్లి, జడీ హైస్కూల్ హెచ్‌ఎం సుబ్బారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ర్యాలీలు, మానవ హారాలు నిర్వహించారు. డీఎల్‌పీవో నాగరాజు, కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి, సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారథి, బొమ్మనచెరువు సర్పంచ్ దండు కరుణాకర్‌రెడ్డి, కోళ్లబైలు-1 సర్పంచ్ ఎం.ఆనందరెడ్డి, చీకిలబైలు సర్పంచ్ ఎం.ప్రభాకర్ , తట్టివారిపల్లె సర్పంచ్ దీప, వేమారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తదితరులు

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

పీలేరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మే 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పీలేరులోని 11వ అదనపు జిల్లా జడ్జి మహేశ్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. లోక్ అదాలత్ సన్నాహకాల్లో భాగంగా శనివారం ఆయన తన కోర్టు పరిధిలోని పోలీసు, ఎక్సైజ్, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులతో కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా మెయింటెనెన్స్, క్రిమినల్, చెక్ బౌన్స్, కుటుంబ తగాదాల కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన తన కోర్టు ప్రాంగణాన్ని సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. స్పెషల్ కోర్టు న్యాయమూర్తి మురళీ, ఎంపీడీవో శివశంకర్, పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, ఈవో గురుమోహన్, శ్యానిటరీఅధికారి నౌషాద్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మదనపల్లె నుంచి చిన్నమండెంకు వెళుతున్న ఒమ్నీ వాహనం సీటీఎం సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో చింతకుంట్లపల్లెకు చెందిన షేక్ ఆరీఫుల్లా(40) అక్కడికి అక్కడే మృతి చెందగా, ముజాహుద్దీన్(38) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు. ఆరీఫుల్లా అక్కిరెడ్డిపల్లెలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తుండగా, ముజాహుద్దీన్ కలకడ సమీపంలో దొడ్ల మిల్క్ ఏజన్సీ నిర్వహిస్తున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు తాలూకా సీఐ తెలిపారు.

తండ్రిపై కొడుకు దాడి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తనకు ప్రతి నెలా రూ.10 వేలు ఇవ్వాలని కోరిన తండ్రిపై కొడుకు దాడి చేసి గాయపరిచాడు. బి.కొత్తకోట మండలం గట్టు గ్రామం ఆంజనేయపురానికి చెందిన శంకర్ రెడ్డి (69) కుమారుడు బాలచంద్రారెడ్డి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తుంటాడు. వృద్ధాప్యం మీద పడడంతో ప్రతి నెలా తన జీవనానికి రూ.10 వేలు ఇవ్వాలంటూ తండ్రి కొడుకును కోరాడు. దీంతో ఆగ్రహించిన కొడుకు తండ్రిపై కర్రతో దాడి చేశాడు. దీంతో గాయపడిన వృద్ధుడిని స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుడిని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాల్ కృష్ణ పరామర్శించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

REAL ESTATE
Commercial, Semi-Commercial Buildings, Plots Available for sale at Tirupati. Please call on 8919506007
AJT-200871

COMPUTER EDUCATION
FREE Courses: DCA, DTP, MS-OFFICE (Lab Fee Only), PAID Courses: DCA, PGDCA, DTP, TALLY, MS-OFFICE, C, C++, JAVA, PYTHON, Spoken English Etc. Cont : SSCT, 663, Bhavani Nagar, Tirupati, 9440706077.
AJT-1161

VEHICLE FOR SALE
ఇన్నోవా 2.5G A/C, 2015 మోడల్ 7,8 సీటర్ మరియు బొలెరో EX 7 సీటర్ A/C, 2017 మోడల్ వెహికల్ అమ్మబడును. ఫైనాన్స్ అవైలబుల్. సంప్ర: 83099 47382, 97047 66039
AJT -1156

NEUROLOGIST
డా.కె.నిరంజన్ బాబు, M.D (Med), D.M (Neuro) పక్షవాతం (Stroke), I.C.U (24hrs), ఫిట్స్ (మూర్ఛ) తలనొప్పి, మైగ్రేన్ తలతిరుగుట, తిమ్మిర్లు, మెడ, నడుము, కండరాల నొప్పులు, సంప్ర. సాయి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, DBR హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, తిరుపతి సెల్ : 94944 03825.
AJT - 200853

WANTED
Project Manager required to work at GRASM TI MIGRANTS, APSACS (HIV AIDS) Project, Bairagipatteda, Tirupati. Qul: MSW Exp 5 years Can send to gramodayasamiti@gmail.com Contact: 9182322376, 8142173026 Last Date :20-04-2025
AJT - 200920

FLAT FOR SALE
తిరుపతి కపిలతీర్థం దగ్గరలో NGOs కాలనీలో కొత్త అపార్ట్‌మెంట్ నందు Ready to Occupy 2 BHK ఫ్లాట్‌లు అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్. Please Cont. : 96668 21667
AJT - 75

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టు మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 227149

WANTED
Wanted female telecallers. Qualification: Any Degree, Salary + Incentives. Contact No. 94944 25897. Job location: Tirupati.
AJT -200872

FLAT FOR RENT
No.109, First Floor, 3 BHK, Padmavathi Nilayam, Narayana puram, near Padmavathi Kalyanam, Tirupati. Con: 83098 27004
AJT -1164

PLOTS FOR SALE
తిరుపతి వేదాంతపురంకు సమీపములో స్వర్ణ-1లో తుడ ఫైనల్ అప్రూవ్డ్ వెంచర్‌లో 50 అంకణముల సౌత్ ఫేస్ ప్లాట్ అమ్మబడును. సంప్ర: 96768 47963
AJT -1158

ఎర్త్ అండ్ మూవర్స్
పాత భవనాలను, బిల్డింగ్‌లను కొట్టి సైట్ క్లియర్ చేసి సెల్లార్ గుంతలు, పిల్లర్ గుంతలు ఎత్తి ఇవ్వబడును. మరియు సిమెంట్ రోడ్డు బ్రేకింగ్ చేయబడును. సంప్ర. : 86109 26629, 91216 62024
AJT - 200795

WANTED
TML బైపాస్‌రోడ్డు, తిరుపతిలో నూతనంగా ప్రారంభించబడిన బాబాయ్ ఎ/సి హోటల్ నందు పనిచేయుటకు కేప్టన్స్, కిచెన్ స్టాఫ్, స్టీవార్డ్ కావలెను. సంప్ర: 79938 17777
AJT -1145

HOUSE FOR SALE
వెస్ట్ ఫేస్ 16x45 అన్నమయ్య రోడ్, కొత్తపల్లి విలేజ్, తిరుపతిలో మస్తాన్ నాయుడు ప్లాట్లలో నిర్మించిన ఇల్లు అమ్మబడును. సెల్ : 9966467366
AJT - 1153

TO-LET
తిరుపతి నిమ్మకాయల వీధి నందు బ్యూటీ పార్లర్, క్లినిక్, ఆర్యవర్క్ చేసుకోవడానికి అన్ని సదుపాయాలు కలిగిన గృహం అద్దెకు కలదు. సంప్ర. : 98483 15414
AJT -239852

WANTED VILLA
Wanted 4 or 5 Bed Room East / North facing villa / Individual House for Rent Purpose in Tirupati, for a Business Family Contact. Ph : 90102 03671
AJT -200870

PLOTS FOR SALE
తిరుపతి విశ్వతమాల ఎం.జి.బ్రదర్స్ క్లాసిక్-2 ప్లాట్-58 ఈస్ట్‌ఫేస్ 50 అం॥మరియు హైవేకి 2Km లు తంబ్లం నందు ఎం.జి. బ్రదర్స్ వారి వాసవి గార్డెన్స్‌లో ప్లాట్-9 సౌత్‌ఫేస్ 48 అం॥ అర్జెంట్‌గా అమ్మబడును. సంప్ర: 98662 34866, 95050 55556
AJT -1163

PLOTS FOR SALE
తిరుపతి కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా సాయి మయూరి-1 తుడా అప్రూవల్ లే-అవుట్ నందు దక్షిణ ముఖం ప్లాట్ 50 అంకణములు అమ్మబడును. సంప్ర: 96768 47963
AJT - 1159

WANTED
హోటల్ విక్రమ్ (లాడ్జ్), RTC బస్ స్టాండ్ దగ్గర, తిరుపతి నందు 3 సంవత్సరాలు అనుభవం కలిగిన రిసెప్షనిస్ట్, రూమ్‌బాయ్స్, హౌస్ కీపింగ్ క్లీనర్లు కావలయును. Cont: 0877 - 2225313, 63636 94935.
AJT - 1162

REAL ESTATES
స్మార్ట్ సిటీ తిరుపతి ప్రతి ఏరియాలో ఓపెన్ ప్లాట్స్ పేరూరు- తుమ్మలగుంట బైపాస్ కమర్షియల్ ప్లాట్స్, ఇల్లులు, విల్లాస్, అపార్ట్‌మెంట్స్, ల్యాండ్స్ లీజ్ ఇవ్వబడును మరియు అమ్మించబడును. సంప్ర 79974 61827
AJT -1144

WANTED
A.V. Residential Layouts & Developers, Tirupati, Office నందు Recepionist and Sales Executive గా పనిచేయుటకు కావలెను. Persons: 2, Any Degree, Salary: 13 to 15 Thousands and incentives. Cont. 98669 24567, 80999 33302
AJT -200867

PLOTS FOR SALE
తిరుపతి IIT, IISER అనుకొని నేషనల్ హైవేలో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ ధర 6లక్షలకే, స్పాట్ రిజిస్ట్రేషన్, డైరెక్ట్ ఓనర్, ఫోన్: 95027 74175, 79959 92114
AJT -1146

FLAT FOR SALE
తిరుపతి KT రోడ్డు, NGO కాలనీ My Home అపార్ట్‌మెంట్‌లో 5th Floor, డూప్లెక్స్, సౌత్ ఫేస్, ఫ్లాట్ నెం. 504 (2300 Sft.) కార్ పార్కింగ్ గల ఫ్లాట్ అమ్మబడును. సంప్ర.:95050 55556, 98662 34866
AJT 1157

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

